క్లుప్తంగా

సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. కళాశాలలోని ఎస్(యువర్ ఎఫెర్ట్ టూ సొసైటీ) క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆ కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటుగా సమాజానికి సేవలదించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకోవటానికి, ఉన్నతంగా ఎదగటానికి సామాజిక అధ్యయనం చాలా అవసరమన్నారు. ఈ విధమైన కార్యక్రమాల ద్వారా అనేక విషయాలను తెలుసుకోవటానికి అవకాశముంటుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఐఎస్ పీజీ డిప్లమో కోర్సుకు దరఖాస్తు చేసుకోండి

విజయవాడస్పోర్ట్స్: స్పోర్ట్స్ కోచింగ్ (2025–27) స్పెషలైజేషన్ 41వ బ్యాచ్‌లో ప్రవేశానికి పాటియలాలోని నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్(ఎన్ఎస్ఎన్ఐఎస్) నోటిఫికేషన్ ఇచ్చినట్లు ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ డీఎస్‌డీవో ఎస్.ఎ.అజీజ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోచింగ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమో కోర్సు ప్రవేశానికి జిల్లాలోని అర్హులైన కోచ్‌లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను మే రెండో తేదీ లోపు htppr://w-w-w.rrc.nrni.rin వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు.

షేక్ కలీషా కుటుంబానికి న్యాయం చేయండి

విజయవాడరూరల్: పంచాయతీరాజ్ డిపార్టుమెంట్‌లో పని చేసి మరణించిన షేక్ కలీషాకు న్యాయపరంగా రావాల్సిన పదవీ విరమణ ప్రయోజనాలను మంజూరు చేసి ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని ఏపీ ఎన్జీఓ నేతలు జిల్లా పంచాయతీ అధికారిణి పి.లావణ్యకుమారిని గురువారం కలిసి వినతి పత్రం అందచేశారు. 1981లో ఫిట్టర్‌గా చేరిన కలీషా 2005లో పదవీ విరమణ చేసి 2024లో మరణించారని, వీరి సర్వీస్ కాలంలో సర్వీస్ రెగ్యులర్ కాలేదని తెలిపారు. కలీషా సర్వీసును సరైన విద్యార్హతలు లేవని రెగ్యులర్ చేయలేదని, సిబ్బంది సరైన సమాచారం పై అధికారులకు పంపలేదని ఎన్జీఓ ప్రతినిధులు తెలియచేశారు. ఈ విషయాన్ని ఎన్జీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.విద్యాసాగర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన దస్త్రాన్ని పరిశీలించి కలీషా కుటుంబానికి న్యాయం చేయాలని డీపీఓతో ఫోనులో మాట్లాడారు. అనంతరం ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి పి.రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.రమణ, మహిళా కార్యదర్శి శివలీల తదితరులు డీపీఓను కలిసిన వారిలో ఉన్నారు.

రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలి



పటమట(విజయవాడతూర్పు): నగరంలోని అన్ని ప్రాంతాల్లో రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా గురువారం ఎంజీ రోడ్డు, సూర్యారావుపేట, నక్కల రోడ్డు, దోర్నకల్ రోడ్డు, ఏలూరు రోడ్డు, రామవరప్పాడు రింగ్ జాతీయ రహదారి, కనకదుర్గ వారధి ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విజయవాడను వ్యర్థరహిత నగరంగా మార్చడానికి పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా జరగాలని, డివైడర్ల వద్ద ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అన్ని ప్రాంతాల్లో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తుండాలని ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణను ఆదేశించారు. డివైడర్లలో హరితాన్ని మరింత పెంచాలని, నగరంలో కాలుష్యం తగ్గించడానికి మొక్కలను మరింత పెంచడానికి చర్యలు తీసుకోవాలని డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్‌ని ఆదేశించారు.

రేపు రన్ ఫర్ జీసెస్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 19న రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఐక్య వేదిక ప్రతినిధులు వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 19వ తేదీ ఉదయం 6 గంటలకు బెంజ్ సర్కిల్ సెయింట్ కెథడ్రల్ నుంచి 5వ నంబర్ రోడ్డు మీదగా సీఎస్ఐ సెయింట్ బాసిలిక వరకు రన్ జరుగుతుందని తెలిపారు. ఈ రన్‌ను విజయవంతం చేయాలని క్రైస్తవ ఐక్యవేదిక ప్రతినిధులు కోరారు.

ఈ రోడ్లపై రాకపోకలు ఎలా?

- రోడ్లపైనే సిమెంట్ వ్యర్థాల కుప్పలు
- ఇబ్బందులు పడుతున్న ఊర్మిళానగర్ వాసులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ఊర్మిళానగర్ చిట్టెమ్మ కొట్టు వెనుక వీధిలో దుస్థితి



అంతర్గత రోడ్లపై వేసిన కుప్పలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అగ్గిపెట్టెల్లాంటి చిన్న చిన్న ఇళ్లు. ఇరుకు రోడ్లు. కనీసం ఆటోలు కూడా వెళ్లే అవకాశం లేని పరిస్థితి. సాధారణంగా ఆ రోడ్లపై నడవాలంటేనే ఇబ్బంది. ఎదురుగా ఏదైనా బైక్ వస్తే కనీసం తప్పుకోవడానికి కూడా అవకాశం ఉండదు. అటువంటి రోడ్లను గత ప్రభుత్వం సిమెంట్ రోడ్లుగా మార్చింది.

కొంత మేరకు రోడ్డు సమస్య తీరింది. గతేడాది సెప్టెంబర్‌లో వచ్చిన వరదలకు ఆ ప్రాంతమంతా నీట మునిగింది. మురుగు నీటి కాల్వల వ్యవస్థ సక్రమంగా లేక ఇబ్బందులు పడ్డారు. కాల్వల ఏర్పాటుకు సిమెంట్ రోడ్లను తవ్వి ఆ వ్యర్థాలను రోడ్లపై కుప్పలుగా వేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు

పారని మురుగు నీరు..

ఊర్మిళానగర్ బ్రహ్మంగారి గుడి ఎదురు చిట్టెమ్మ కొట్టు వెనుక వీధులు అత్యంత ఇరుకుగా ఉంటాయి. వీధులు కేవలం 8 అడుగుల వెడల్పు ఉంటాయి. ఇక్కడ నివసించే వారంతా నిరుపేదలు. రోజువారీ కూలీలు. మార్కెట్ యార్డులో పనులు చేస్తూ, ఆటోలు తోలుతూ జీవనం సాగిస్తుంటారు. ఇళ్లన్నీ అగ్గిపెట్టెలను పోలి ఉంటాయి. ఉన్న వీధులు కేవలం 8 అడుగులే ఉండడం, రోడ్లకు ఇరువైపులా బైక్‌లు నిలిపితే అసలు కాలు తీసి కాలు వేసే పరిస్థితి ఉండదు. అటువంటి రోడ్లను గత ప్రభుత్వంలో సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేశారు. చక్కటి రోడ్లు వేశారు. ఆ తర్వాత ఎన్నికల రావడంతో మురుగు నీటి కాల్వలు అభివృద్ధి చేయలేదు. రోడ్లు సమకూరినా మురుగు నీరు ప్రవహించే అవకాశం లేకుండా పోయింది. అంతర్గత రోడ్లను మెయిన్ రోడ్డుతో కలిపి సిమెంట్ రోడ్లు వేశారు. ప్రస్తుతం సిమెంట్ రోడ్లను మెయిన్ రోడ్డుకు కలిపే చోట ఖాళీగా ఉంది. వీటిపై సిమెంట్ దిమ్మెలుగానీ, సిమెంట్ పైపులుగానీ వేసి రహదారులు కనెక్ట్ చేయాలి.

ప్రజలకు అసౌకర్యం..

మురుగు ప్రవహించాలంటే అంతర్గత రోడ్లలోని కాల్వలను మెయిన్ కాల్వకు అనుసంధానం చేయాలి. ఇందుకోసం కాలువలను కలిపేందుకు తవ్వారు. ఆ వ్యర్థాలను తీసి రోడ్లపై అడ్డంగా కుప్పలుగా పోశారు. కుప్పలు పోసి రెండు వారాలకు పైగా గడుస్తోంది. కానీ వాటిని తొలగించక పోవడంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రానికి పనులు ముగించుకుని అందరూ బైక్‌లపై ఇళ్లకు చేరుతారు. సిమెంట్ వ్యర్థాల కుప్పల కారణంగా తమ ఇళ్ల వరకు బైక్‌లు వెళ్లే అవకాశం లేక... మెయిన్ రోడ్డుపై నిలిపివేస్తున్నారు. మెయిన్ రోడ్డు సైతం కేవలం 10 అడుగులు మాత్రమే ఉండడంతో అసౌకర్యంగా మారింది. వృద్ధులు, దివ్యాంగులు బయటకు వెళ్లలేని పరిస్థితి. ఇక రాత్రి పూట స్థానికులు నరకయాతన పడుతున్నారు. ఏదైనా పని మీద బయటకు రావాలంటే ఆ కుప్పలు దాటుకుంటూ వెళ్తున్నారు. తక్షణమే సిమెంట్ వ్యర్థాల కుప్పలు తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. మురుగు కాల్వలపై సిమెంట్ దిమ్మెలుగానీ, నాపరాళ్లుగానీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. రెండు రోడ్లు కలిసే చోట కాల్వలకు సిమెంట్ పైపులు ఏర్పాటు చేసి భవిష్యత్‌లో ఇబ్బందులు లేకుండా చూడాలంటున్నారు. రెండు వారాలుగా ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోకపోవడంపై మండిపడుతున్నారు. వర్షాకాలం ప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'వక్ఫ్ చట్ట సవరణపై బాబు నైజం మరోసారి బయటపడింది'

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజలను నమ్మించి వంచించే సీఎం చంద్రబాబు నైజం వక్ఫ్ చట్ట సవరణ అంశంలో మరోసారి బయటపడిందని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వక్ఫ్ చట్ట సవరణ విషయంలో అన్యాయానికి బలైన ముస్లిం సామాజికవర్గానికి ఏం సమాధానం చెబుతారని చంద్రబాబును ప్రశ్నించారు. ముస్లిం మైనార్టీలు సమాజంలో భాగం కాదనుకుంటున్నారా అంటూ మండిపడ్డారు. ఎన్నికలప్పుడు మాత్రం ఓట్లు వేయించుకునేందుకు ముస్లింల సహకారం కోసం పాకులాడే మీకు చట్ట సవరణకు మద్దతు తెలిపినప్పుడు వారు గుర్తుకు రాలేదా అని ఎద్దేవ చేశారు. రాజకీయాలలో నలభై ఏళ్ల అనుభవం ఉందని పదేపదే చెప్పుకోవడం తప్ప ప్రజా ప్రయోజనాల గురించి ఏనాడైనా ఆలోచించారా అంటూ నిలదీశారు. వక్ఫ్ చట్ట సవరణ విషయంలో మీరు చేసిన ఘోర తప్పిదానికి భవిష్యత్‌లో ముస్లిం సమాజానికి సమాధానం చెప్పుకోక తప్పదని హెచ్చరించారు.

21న యువకవి సమ్మేళనం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సిద్ధార్థ అకాడమీ, కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా ఈ నెల 21వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు సిద్ధార్థ ఆడిటోరియంలో యువకవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కవి విమర్శకులు డాక్టర్ రావులపాటి సీతారాం, సిద్ధార్థ కాలేజీతో పాటుగా నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు.

దేవినేనికి ఘన నివాళి



గుణదల నెహ్రూ ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, కడియాల బుచ్చిబాబు, పార్టీ శ్రేణులు

గుణదల(విజయవాడ తూర్పు): విలువలు కలిగిన రాజకీయ నాయకుడిగా దేవినేని రాజశేఖర్ (నెహ్రూ) ప్రజలకు సేవచేశారని పలువురు వైఎస్సార్ సీపీ నేతలు అభిప్రాయపడ్డారు. మాజీ మంత్రి దేవినేని నెహ్రూ వర్ధంతి కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. 'తూర్పు'లోని అన్ని డివిజన్లలో దేవినేని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు దుస్తుల పంపిణీ, అన్నదానం, వంటి సేవా కార్యక్రమాలు చేశారు. నెహ్రూకు వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అవినాష్ నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, మొండితోక అరుణ్‌కుమార్, రమేష్‌యాదవ్, సీనియర్ నేత కడియాల బుచ్చిబాబు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

- మొగల్రాజపురం: ఆరో డివిజన్ పరిధిలోని మారుతీనగర్, నిమ్మతోటసెంటర్‌లో అన్నదానాలు చేశారు.
- కృష్ణలంక: 17, 18, 20, 21,22 డివిజన్లలో నెహ్రూ చిత్రపటాలు, విగ్రహాల వద్ద నేతలు నివాళులర్పించారు.



రింగ్ రోడ్డులో నివాళులర్పిస్తున్న అవినాష్, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ తదితరులు

పటమట: 9,10,11,12,13,14 డివిజన్లలో నేతలు అన్నదానాలు, చీరల పంపిణీ చేశారు.

ఆటోనగర్: ఆటోనగర్ పరిసరాలు, 15వ డివిజన్‌లో నేతలు నివాళులర్పించారు. పలుచోట్ల అన్నదానాలు జరిగాయి.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బాలిక అదృశ్యమైన ఘటనపై బాలిక అమ్మమ్మ ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట కొండ ప్రాంతంలో రామాలయం వద్ద కోనా లక్ష్మి నివాసం ఉంటోంది. లక్ష్మి రెండో మనవరాలు(16) వన్‌టౌన్‌లోని మహిళా కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. కొంత కాలంగా అనారోగ్యం కారణంగా కాలేజీకి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటోంది. అయితే ఇంటి వద్ద ఉన్న బాలిక తరుచూ ఫోన్‌లో మాట్లాడుతూ కనిపించేంది. అయితే బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలిక బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన లక్ష్మి ఆరా తీయగా, కొంత కాలంగా బాలిక అవినాష్ అనే యువకుడితో ఫోన్‌లో మాట్లాడేదని తెలిసింది. తన మనవరాలు కనిపించడం లేదని ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

బాబా మందిరంలో మజ్జిగ పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): బాబా మందిర సేవలను వినియోగించుకోవాలని ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిర గౌరవాధ్యక్షుడు గౌతంరెడ్డి అన్నారు. ముత్యాలంపాడు సాయిబాబా మందిరంలో గురువారం ఆలయకమిటీ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం వేసవి ముగిసే వరకు ప్రతి గురువారం భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో మందిర కమిటీ కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పేవర్ బ్లాక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన



పేవర్ బ్లాక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న రెహమతున్నీసా, నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 38వ డివిజన్ 119వ వార్డు సచివాలయం పరిధిలో గల చేపల రేవు, లోటస్ లెజండ్ అపార్ట్‌మెంట్స్ వద్ద ఏర్పాటు చేయనున్న పేవర్ బ్లాక్స్ నిర్మాణ పనులకు స్థానికకార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో కొన్ని ప్రదేశాల్లో పేవర్ బ్లాక్స్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యతను గుర్తించి కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదన పెట్టామని తెలిపారు. కౌన్సిల్‌లో ఆమోదంతో మంజూరైన రూ.19లక్షలతో పనులను ప్రారంభించినట్లు వివరించారు డివిజన్‌లోని ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కొట్టేటి కోటయ్య వీధిలో జరుగుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ హయత్ షరీఫ్, లోటస్ అపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్ పీ జనార్ధన్, ఇర్ఫాన్, కాంట్రాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న సీఐటీయూ భవన నిర్మాణ విభాగం నాయకులు

పటమట(విజయవాడతూర్పు): భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఈ నెల 24న సీఐటీయూ ఆధ్వర్యాన నగరంలోని ధర్నాచౌక్‌లో తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ తూర్పు నగర అధ్యక్షుడు వీబీ రాజు అన్నారు. పటమటలో గురువారం కార్యక్రమ బ్రోచర్‌ను, కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాల్లో సంక్షేమ బోర్డు అమలవుతోందని మన ఏపీలో మాత్రమే ఇది అమలు కావడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో సంక్షేమ బోర్డుని భవన నిర్మాణ కార్మికులకు తీసుకొస్తామని హామీ ఇచ్చి నెలలు పూర్తవుతున్నా పట్టించుకోని పరిస్థితి వచ్చిందన్నారు. లేబర్ కోడ్లు రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల గృహ నిర్మాణాలకు వెల్ఫేర్ బోర్డు ద్వారా సబ్సిడీ లోన్లు ఇవ్వాలని, కార్మికులు పని కోసం వేచి ఉండే అడ్డాలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉచిత వైద్యం ,పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని, జిల్లాల వారిగా వలస కార్మికులకు ప్రస్తుతం ఉంటున్న చిరునామా పై సంక్షేమ గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వి.శ్రీను, సింహాచలం, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు

నాన్ ఆపరేషన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ప్లకార్డులతో ధర్నా చేస్తున్న కార్మికులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆర్టీసికి సంబంధించి విజయవాడలోని నాలుగు నాన్ ఆపరేషన్ యూనిట్స్‌లోని ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం విద్యాధరపురంలోని ఆర్టీసీ వర్క్‌షాప్ ముందు ధర్నా చేశారు. నాన్ ఆపరేషన్ యూనిట్స్ సెక్రటరీ కల్యాణ్ కుమార్, వర్క్‌షాప్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ స్వామి, సీహెచ్ శ్రీనివాస్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. అక్రమ సస్పెన్లు, రిమూవల్స్‌ను తక్షణమే ఎత్తి వేయాలని, ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తి జీతం ఇవ్వాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పురుద్ధరించాలని కోరారు. అలాగే 114 జీఓలో పొందుపరిచిన విధంగా నైట్ అవుట్ అలవెన్స్‌లను రూ.150 నుంచి రూ.400లు చెల్లించాలని, డెప్యూటేషన్లను యథావిధిగా అమలు చేయాలని, విశ్రాంత ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీ బస్సులలో ప్రయాణాలను అనుమతించాలని పేర్కొన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలను చెల్లించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీఓ ప్రకారం వారి పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, టీఆర్ఎస్‌లో వల్కనైజింగ్ పోస్టులను భర్తీ చేయాలని, నిలిచిపోయిన ప్రమోషన్లు ఇవ్వాలని, మేనోవర్ రేట్‌ను పెంచాలని విజ్ఞప్తి చేశారు. క్యాడర్ స్ట్రెంగ్త్‌ను అమలు చేయాలన్నారు. ఎలక్ట్రిక్ బస్‌లను ప్రభుత్వం లేదా సంస్థ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్ఆర్ఆర్‌లో ఉచిత వైద్య శిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన లివ్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, జనరల్ కార్డియాక్, ఫిజియోథెరపీ సేవలు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ మంచి ఆరోగ్యం అందించాలనే మహోన్నత ఆశయంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ నరసింహారావు, డాక్టర్ హర్షిత తదితరులు ఆరోగ్యంగా జీవించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, అధ్యాపకులు డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ నాగేశ్వరరావు, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ డి. యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



వించిపేట ఆరు పంపుల బావి వీధిలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఆరేసిన దుస్తులు



రావిచెట్టువీధిలో ద్విచక్రవాహనం, ఇనుప గేట్లను ట్రాన్స్‌ఫార్మర్‌కు గొలుసులతో కట్టిన వైనం

వించిపేట(విజయవాడపశ్చిమ): చిన్నపాటి అజాగ్రత్త కూడా కొన్ని సార్లు ప్రాణాలను తీస్తుంది. వించిపేటలోని ఆరుపంపుల బావి వీధిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు కొంతమంది స్థానికులు ప్రతి రోజు తడి దుస్తులను ఆరవేస్తున్నారు. అదే విధంగా రావిచెట్టువీధిలోని మరో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద స్థానికులు ద్విచక్ర వాహనాలు, ఇనుప గేట్లను ఎవరు దొంగిలించకుండా ఉండేందుకు ఏకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫర్మర్‌కు గొలుసులు వేసి తాళాలు వేస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద పాఠశాల పిల్లలు ఆడుకుంటూ విద్యుత్ షాక్‌కు గురైన సంఘనటలు జరిగాయి. అయినా స్థానికులు అవేవీ పట్టనట్లు ప్రమాదాల బారిన పడేలా ప్రతి రోజు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోజు ఆయా వీధుల్లో తిరిగే విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది కూడా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరిగినప్పుడు నష్టనివారణ చర్యలు తీసుకోవడం కంటే ప్రమాదాలు జరగకుండా ముందస్తు నివారాణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్తమ ఆర్థిక ప్రణాళికతో సంపద సృష్టి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉత్తమ ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోవటం ద్వారా చక్కని సంపద సృష్టి చేయవచ్చని సెబీ మాజీ డెప్యూటీ జనరల్ మేనేజర్ సూర్యకాంత్‌శర్మ అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో 'ఆర్థిక ప్రణాళిక ద్వారా సంపద సృష్టి' అంశంపై వెబినార్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన సూర్యకాంత్‌శర్మ మాట్లాడుతూ సంపదసృష్టికి యువతకు అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. పెట్టుబడి ప్రాధాన్యతలను గుర్తించి ప్రణాళికను రూపొందించుకోవాలని చెప్పారు. మ్యూచువల్ ఫండ్స్ వంటి అనేక రంగాలను అందులో పరిమితులను వివరించి అటువంటి అంశాలపై యువత అవగాహన పెంచుకోవాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అందుబాటులోకి వస్తున్న అనేక నూతన విషయాలను అవగాహన చేసుకుంటూ ముందుకు సాగాలని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తమతమ రంగాలకు సంబంధించిన నూతన అంశాలను తెలుసుకోవటానికి నిత్యం కృషి చేయాలన్నారు. కార్యక్రమానికి విభాగాధిపతి డాక్టర్ ఎస్.మణికంఠ సమన్వయకర్తగా వ్యవహరించగా అధ్యాపకులు డాక్టర్ వీ విజయదుర్గప్రసాద్, వై.సుధచంద్ర పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటికలు



దేవరాగం నాటికలోని సన్నివేశం

విజయవాడ కల్చరల్: పీఎంకేఎం ఆర్ట్స్, ఏపీ చలన చిత్ర వాణిజ్యమండలి సంయుక్త ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కందుకూరి కల్యాణమండపంలో ప్రదర్శించిన 44 వ జాతీయ సాంఘిక నాటికల పోటీలు గురువారం రెండవ రోజుకు చేరుకున్నాయి. తొలి ప్రదర్శనగా కేకేఎల్ స్వామి రచించి దర్శకత్వం వహించిన దేవరాగం నాటికలను, రెండవ ప్రదర్శనగా బ్రహ్మానందరావు, రచించి దర్శకత్వం వహించిన మనసాక్షి, మూడో నాటికగా, పల్లేటి కుశలశేఖర్ రచించి దర్శకత్వం వహించిన మోచేతి కంకణాలు నాటికలను ప్రదర్శించారు. నాటక రంగానికి చెందిన సూర్యదేవర జగన్నాథరావు, దామోదర గణపతిరావు, ఈవన రమేష్‌బాబును నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, పీఎంకేఎం ఫైన్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు పసుపులేటి వెంకటరమణ, సోమిశెట్టి అమృత వర్షిణి, గుడివాడ లహరి, కొండిశెట్టి సురేష్ బాబు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్న భర్త, అత్తమామలపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భవానీపురం కోళ్ల ఫారం రోడ్డులో ఉంటున్న షేక్ యాస్మినా బేగంకు షేక్ అక్బర్‌తో 2017లో వివాహమైంది. వీరి కాపురం రెండేళ్లు సక్రమంగానే సాగింది. వీరికి బాబు పుట్టాడు. ఆ తర్వాత దంపతుల మధ్య గొడవలు మొదలయ్యాయి. నిత్యం మద్యం సేవించి రావడం, ఇతర స్త్రీలతో ఫోన్‌లు మాట్లాడడం చేస్తున్నాడు. కుటుంబ సభ్యులకు విషయం చెప్పగా భర్త అక్బర్‌కు మద్దతుగా నిలిచారు. అదనపు కట్నం కోసమే పెళ్లి చేసుకున్నామని, రూ.5 లక్షలు కట్నం తేవాలని వేధించడం ప్రారంభించారు. ఈ విషయమై గతంలో ఒకసారి పోలీసులకు ఫిర్యాదు చేయగా కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. ఆ తర్వాత కొద్ది నెలలు బాగానే చూసుకుని, తర్వాత మరలా కొట్టడం, వేధించడం ప్రారంభించాడు.

నిత్యం అనుమానిస్తూ వేదనకు గురిచేశాడు. భర్తకు తోడు అత్త జాన్‌బీ, మామ జానిమియా, ఆడపడుచు గోరీబీ, ఆమె భర్త వేధింపులు అధికం చేశారు. వేధింపులు భరించలేక పుట్టింటిలో ఉంటోంది. ఈ తరుణంలో భర్త అక్బర్ వచ్చి తన కుమారుడిని తనకు ఇవ్వాలని లేదంటే చంపివేసి తీసుకెళ్తానని బెదిరించాడు. దీంతో బాధితురాలు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.